"కథానిక"

# పిలిస్తే పలికిన హృదయం

బి. యస్. ఆర్. కృష్ణారావు

క్షణక్షణం అనేక సున్నిత హృదయాలను గాయపరుస్తూ లావణ్యాలను హరింప చేస్తూ కిలకిల నవ్వుతూ తానేదో ఘనకార్యం చేసిన వాడిలా భావించి ముందుకు సాగిపోతూ వుంటాడు ప్రతి మానవుడూ. తామావిధంగా ప్రవర్తించి వుంటంచేత ఎదుటివారి హృదయాలకు బాధకలుగుతుందనే నిశిత జ్ఞానం వాళ్ళకుండదు. ఇటువంటి వాతావరణం పెరుగుతున్నప్పుడు మనంతట మనమే ధైర్యం తెచ్చుకుని జీవిత సమస్యల్ని కాలానికి ఎదురీది ఎదుర్కోవాలి గాని ప్రాణం తీసుకోరాదు. నువ్వు చాలా పొరపాటు చేశావమ్మాయి. ప్రాణం తీసుకోటమనేది తేలిగ్గా అనుకున్నా అనుకున్నట్లుగా జరగటం చాలాకష్టం' అన్నాడు పెదబాబు.

దేవుని విగ్రహం ఎదట మోకరిల్లినట్లుగా కూర్చుంది సుశీల. పెదబాబు ముఖంలోకి కన్నార్పకుండా చూస్తున్నది. జీవితంలో అనేక సమస్యల్ని ఎదుర్కొని పరిష్కరించాడు. అనేక సంఘటనలు చూశాడు. అనేక తరహాల మనుష్యుల్ని-పరిస్థితులనూ అవగాహన చేసుకున్నాడు. ఆజానుబాహువు దబ్బపండులా పండు పండిన శరీరం. బంగారు తీగల్లా మెరుస్తున్న తెల్లని వెంట్రుకలూ, బారెడు గడ్డముగల ఆ ధర్మ మూర్తిని చూస్తూ కన్నీరు కార్చింది సుశీల. తన అంతరాంతర కల్లోలాన్ని అర్థం చేసుకున్నాడని తెలుసుకోగానే ముఖం లజ్జా విహీనంతో వంగిపోగా ఆయన ముఖం చూడలేక చేతులతో కప్పుకుని దుఃఖం పట్టలేక బావురుమని ఏడ్చింది ఆయన కాళ్ళమీదపడి సుశీల.

వాత్సల్యపూరితమైన హృదయంతో ఆమె తల నిమురుతూ చిరునవ్వు నవ్వుతూ 'పిచ్చిదానా లోకంలో జరిగే ప్రతిఒక్క సంఘటనకీ ప్రతి ఒక్కడూ కారకుడు. ప్రతి మానవుడూ ఎదుటివారి జీవితంలోకి తొంగిచూసి వారి లోటుపాట్లను లేకెత్తి చూపుతూ సంతోషిస్తాడేగాని తన జీవిత సమస్యల్ని గురించి మరొకడు తొంగి చూస్తూ హేళన చేస్తున్నాడనే నిశిత జ్ఞానం వుండదు. ఈ పెదబాబు ఈ డెబ్భైఏళ్ళ జీవితంలో ఎన్ని సమస్యల్ని చూసి పరిష్కరించ గలిగాడో ఆలోచిస్తే నువ్వీధంగా విచారపడవు సుశీలా' అన్నాడు.

'బాబూ నా తప్పిదాన్ని దేవుడు మన్నించి నన్ను నలుగురిలో తలెత్తుకు తిరగనిస్తాడా? తమరు గురుతుల్యులే కాక దైవసమానులుకూడా. లేకపోతే మీరు నన్ను రక్షించేవారే కారు?' అన్నది సుశీల పొంగి పొర్లివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

'పిచ్చిదానా! జీవితం జీవించుటకొరకేగాని ప్రాణం తీసుకోటానికి కాదు పిరికిపందల మాదిరి. ఉన్న సమస్యల్ని తెగతెంపులు చేసుకొందా మనుకుని సమస్యలు లేని ప్రశాంత సీమల్లోకి అందరూ పోలేరు కాలాన్ని ఎదుర్కొనలేమనే ధైర్యం లేనప్పుడు ఏ విషయంలోనూ దిగకూడదు. దిగిన తరువాత ఎదురీదగలమనే దృఢ నిశ్చయంతోనే వుండాలిగాని బేజారయిపోయి ప్రాణత్యాగం చెయ్యటం తెలివిమాలిన పని. చాలా అలసిపున్నావుగాని కొంచెం విశ్రాంతి తీసుకో. నేను సాయంకాల కృత్యాలు తీర్చుకోటానికి వెళతాను' అని కుర్చీలోంచి లేచారు పెదబాబు. సుశీల అట్లాగే కూర్చున్నది ఆ కుటీరాన్నంతా కలయజూస్తూ.

* * *

'లలితా ముసలాయన బయటకు వెళ్లాడుగా అన్నట్లు సుశీల ఎక్కడికో వెళ్ళిపోయిందిటగా. శని విరగడయింది. మనకున్న అడ్డుల్లో ఒక అడ్డు తీరిపోయింది. లేకపోతే దేవుడా ఇంత చేశారని ఒకమూలపడివుండక తనూ మనోయిందిగా పోయిందేమో తన ప్రాణంతానే తీసుకున్నది.

ఏమంటావ్' అంటూ వచ్చాడు రామారావు లలిత దగ్గరికి.

'ముసలాయన చుట్ట కాల్చుకుంటూ వెళ్ళిపోయాడంతే. భయంలేదు. సుశీల వెళ్ళిపోయి ఇవాళకి పది రోజులయింది. పాపం ఎక్కడికయినా వెళ్ళిపోయిందో, ప్రాణమే తీసుకుందో. ఆవిడ చర్యలు నాకేమంత నచ్చకపోయినా ఇల్లా వెళ్ళిపోయిందంటే నాకూ చాలా విచారంగానే వుంది. ముసలాయన నాలుగు రోజులు వెతికాడు. బహుశా ఆ వెధవ గోపాల్‌తోనే వెళ్ళిందేమోనని ఇంక వెతకడం మానేశాడు. ఇంతకీ దేనికయినా కాలంకర్మం కలిసిరావాలి' అన్నది లలిత రామారావు కళ్ళల్లోకి చూస్తూ.

'ఒక తప్పును ఇద్దరు మానవులు చేస్తున్నా లోకదృష్టిలో ఆ రెండూ సమాన తప్పుల్లో కనబడవు. అదే సృష్టి వైచిత్రం. ఇప్పుడు నువ్వూ సుశీలా ఒక తప్పునే చేస్తున్నారు. కాని నీ తప్పును లోకం వేలెత్తి చూపటానికి అడ్డుగా ఒక బొమ్మ వున్నది. సుశీలకు ఆ అడ్డు లేదు. అంచేత ఆ రహస్యం తెల్లవారిపోయి నలుగురి దృష్టిలోనూ పడ్డది. కాబట్టి తప్పులు చేసేవారికన్నా న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలూ ఎరక్క వాటిని బయటపెట్టే సంఘానిది ప్రధమ తప్పంటాను. ఏమంటావ్ లలితా' 'ఆ మాట నిజమే' అంటూ అతని రొమ్ము పంజరంలో ఇరుక్కుపోయింది లలిత.

* * *

'పెదబాబా! వారు నాకు కనబడతా రంటారా. మీరన్న మాట ఎప్పటికీ తప్పిపోదని నాకు నమ్మకం ఉంది. ఏమంటారు బాబూ' అన్నది సుశీల పెదబాబు పాదాలచెంతకూర్చుని. 'మనస్సులో మాలిన్యంలేని ప్రేమ ఎప్పుడయితే వున్నదో మానవ శక్తులు ఎన్ని అడ్డంకులు కల్పించినా సహజ శక్తులు వాటినుండి కాపాడి తీసుకురాగలవు సుశీలా. కాని కాలం ఖర్మం కలసి వచ్చేటంత వరకూ నిరీక్షించాలి' అన్నాడు పెదబాబు తన నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడిచేస్తూ.

'సమస్యలులేని జీవితం వుండదన్నారు గదా ఒకేరకమైన తప్పును ఇద్దరు చేస్తున్నప్పుడు ఆ ఇద్దరి జీవితాల్లోనూ ఒకేరకమైన సమస్య లుండవేం బాబూ' అన్నది సుశీల' బాబు ఏం సమాధానం చెబుతాడోనని ఆదుర్దాగా చూస్తూ. బాబు నవ్వాడు.

'ఆకలి అనేది కలగటం మానవులందరికీ సహజమే. ఆ ఆకలి బాపుకోటానికి ఏదయినా ఒక పదార్థం తింటే పోతుంది. గొప్పవాడు తింటాడు. కాని ఆ తినే తిండియందు ఆప్యాయత వుండదు. తినటంకోసం మనం బ్రతుకుతున్నామనుకుంటాడు. కాని బీదవాడు పట్టెడన్నమయినా చివరకు గంజి అన్నమయినా ఆప్యాయంగా సంతోషంగా దొరికిందికదా అని తిని తృప్తిని వెల్లడిస్తాడు. బ్రతికేందుకుగాను ఈ కాసిని గంజినీళ్ళయినా మనం తాగుతున్నాం అనుకుంటాడు. కాని వాణ్ణి మనం ఎగతాళి చేస్తాం. కరువుకు పుట్టాడు దౌర్భాగ్యుడు అని. ఆ అన్నం తిని వాడిని బ్రతికి ఎవర్ని ఉద్ధరించమన్నారు అని ఛీదరించుకుంటాం. కారణం ఏమిటి?...' ఈ మాటలు అంటున్నంతసేపు బాబు ముఖం ఎర్రబడింది కాని తేజస్సు ప్రతిఫలిస్తున్నది. సుశీల కన్నార్పకుండా అట్లాగే చూస్తూ కూర్చున్నది. బాబు మాటలు వింటుంటే ఆమె తన కష్టాలన్నీ గడిచిపోయినట్లుగా భావిస్తున్నది.

'డబ్బు. డబ్బు వుంటంచేత గొప్పవాడు వెర్రి మొర్రిగా తిన్నా లోకం హర్షిస్తుంది కాని దూషించదు. బీదవాడు ఆప్యాయంగా తింటే అపాత్రుడంటుంది. ఇదే వ్యత్యాసం తల్లీ' అన్నాడు సుశీల తల నిమురుతూ.

'నేను వార్ని హృదయపూర్వకంగా ప్రేమించాను బాబూ. ఆ సంగతి వారికీ తెల్సు. కేవలం కామతృష్ణ తీర్చుకోటానికి వారి సాంగత్యాన్ని కోరలేదు. కాని దేవుడు నన్నిట్లా అన్యాయం చేసి రచ్చకీడ్చాడు' అని కంట తడిపెట్టింది సుశీల.

'నీ అంతరాంతర కల్లోలాన్ని అర్థం చేసుకున్నాను తల్లీ. జీవితం అమూల్యమయినదనీ నిరాశకు తావు ఇవ్వకూడదనే నేను చెప్పేది. లలితకు భర్త వున్నాడు. తిండి గడుస్తున్నది. పసుపు కుంకుమకు కొరత లేదు. కాని నిజ భర్తతో సౌఖ్యంలేదు. ఆ సౌఖ్యంకోసం రామారావు

నాశ్రయించింది. అది దక్కించుకుని అనుభవిస్తున్నది. అది కేవలం కామతృష్ణ. భర్తనే గోడ చాటున తను నీచంగా ప్రవర్తిస్తున్నా సంఘ దృష్టికి గోడదాటిచూసే అవకాశం సామాన్యంగా లభించదు. అందుచేత కప్పిపోతున్నది. సంఘదృష్టిలో నీ జీవితం మోడులాంటిది. అది మొక్కయినా ఎండిపోవాలనే లోకం కోరిక. అందుచేత మీ రిద్దరూ హృదయపూర్వకంగా ప్రేమించుకున్నా అది లోకదృష్టిలో తప్పుగా కనబడింది. అది లోక రివాజు. కాని ఈ స్థితి కొచ్చింతరువాత నిరాశకు ఏమాత్రం తావివ్వకూడదు' అన్నాడు పెద బాబు.

సుశీల మాట్లాడలేదు. తన మనస్సులో వేవేల నమస్కారాలు పెట్టింది. ఏనాటికయినా పెద బాబు ద్వారానే తనకు విమోచన మవుతుందని ఆమెకు తెలుసు.

బాబు కుర్చీలోంచి లేచి వెళ్లిపోయాడు.

* * *

సాయంత్రం ఆరుగంటలు దాటింది. సుశీలకు జ్వర తీవ్రత హెచ్చి ఆరురోజులయింది. పెద బాబు ఆలోచన, జ్ఞానమూ అంతా వేరు. ఆయనకు డాక్టర్లమీద నమ్మకములేదు. ప్రకృతి చికిత్సతోనే సర్వరోగాలూ నయం కావాలంటాడు, తనే చికిత్సచేస్తున్నాడు. సుశీల విషయంలో ప్రకృతి చికిత్సకూడా లాభంలేదని తెల్సు. కాని అంతకన్న గత్యంతరం కనబడ లేదు. ఈ ఆరురోజులనుంచి కంటికి రెప్పవలె కాపాడుతున్నాడు.

ప్రపంచంలో జరిగే విషాదాలకు కారణం తర్కశాస్త్రము. మనిషిని మనిషి అర్థంచేసుకోలేకపోవటమే ఈ తర్కశాస్త్రానికి కారణం అర్థం చేసుకుందామని ప్రయత్నించి అర్థం చేసుకోకపోవటంలేదు. అర్థం ఐనా కాకపోయినా అసలు అర్థం చేసుకునేందుకు నిరాకరించటం లేదు. ఒకవేళ అర్థం చేసుకోగలిగినా తగిన సహాయం చేయటానికి నిరాకరించటం అందరికీ ఇష్టంవుండదు. ఇష్టంవుండి అన్నింటికీ సిద్ధపడ్డ వాళ్ళకి కాలం దొరకదు. తను సాధించదల్చుకున్న కార్యం పూర్తయ్యేవరకూ ప్రతి ఒక్క వ్యక్తినీ, విషయాన్నీ జాగ్రత్తగా పరిశీలించి కార్యరంగంలోకి దిగి కృతకృత్యులు కావటం పూజ్యులయిన వారి విధి.

రాత్రి ఎనిమిదిగంటలయింది. సుశీలకు చేయవలసిన ఉపచర్యలంచేసి తను కాస్త విశ్రాంతి తీసుకుందామని పక్కమీద కూర్చున్నాడు పెద బాబు సుశీల సొమ్మసిల్లి నిద్రపోతున్నది. ఆ కుటీరమంతా ప్రశాంతంగా వున్నది.

ఆ రాత్రివేళ ఒక యువకుడొచ్చాడు ఆ కుటీరానికి. తలా గడ్డం బాగా మాసివున్నయి. జీర్ణ వల్కలాలు ధరించినా, సరైన పోషణ లేనట్టుగా తోచినా అతని ముఖంలో కళకాంతులు ఉట్టిపడుతున్నాయి. దేనికోసమో అతను పడే తహతహ అతని నేత్రద్వయంలో ప్రస్ఫుటిత మవుతున్నది. ఆ యువకుడొచ్చి వాకిలి ముందర నిల్చున్నాడు. పెదబాబు ఆ యువకుణ్ణి చూచాడు. లేచి బయటకువచ్చి ఆ యువకుడివైపు ఒక్కక్షణంసేపు చూశాడు.

'స్వామీ ఇదొక ఆశ్రమమని తలచి ఇక్కడికొచ్చాను. తమరు దయదల్చి నాకు తమ శిష్యత్వం ఇప్పించాలి. ఈమానసిక ఆందోళన భరించలేక ఇట్లా వచ్చాను. తమరు నన్ను పరిగ్రహించాలి.'

పెదబాబు అతన్ని దగ్గరేవున్న కొలను పద్దకు తీసుకు వెళ్లాడు. కుటీరానికి ఒక ఇరవై గజాల్లో వున్న దాకొలను.

ఇద్దరూ కూర్చున్నారు కాలవ ఒడ్డున.

'ఇంత చిన్న వయస్సులో నీకు మానసిక ఆందోళన ఏమిటి బాబూ. ఆ ఆందోళన సంసారరీత్యా కలిగిందా, చదువు సంధ్యలరీత్యా కలిగిందా లేక తల్లిదండ్రుల రీత్యా కలిగిందా?'



'అవన్నీ నన్ను అడగవద్దు స్వామీ. పాత విషయాలను తల్చుకున్నందువల్ల లాభం లేక పోయినా ఆమాటలు చెప్పినతరువాత నేను జీవించలేను నన్ను క్షమించండి.'

'కేవలం నీ మానసికాందోళనను పోగొట్టుకోటానికని ఆశ్రమమిప్పించాలని అడుగుతున్నావు గాని, ఈ ప్రపంచాన్ని అర్థంచేసుకుని, జీవిత సుఖదుఃఖాలను అనుభవించి విరక్తిచెంది కాదను కుంటాను. అవునా.'

'అవును స్వామీ.'

'సమస్తేంద్రియ చైతన్యాలతో నిన్ను నీవు అర్థం చేసుకోగలిగి వుంటే నీ జీవితంలో ఈ విషాదసంఘటన జరిగి ఉండదేమో.'

'అది కేవలం విషాదసంఘటనే కాదు. నేను గొప్ప తప్పిదం చేశాను.'

'నిశితమైన ఆత్మసాధన లేకుండా అమాయకులను వంచించి వారి సున్నిత హృదయాలను కొంతకాలం సంతోషపెట్టి, వారు ఆ అత్యంతానుభవం కోసం ముందుకు సాగిపోదామనే స్థితిలో, కొండశిఖరంమీద నుంచి క్రిందికి తోయ వచ్చునా.'

'స్వామీ మూర్ఖుణ్ణి క్షమించాలి.'

'కొంతకొంతమంది వ్యక్తులు సాంఘికంగా అసాధారణ వ్యక్తులుగానే కనబడతారు. కాని వారిలో మానవత్వం నశించలేదనీ సాధారణ ఆశ్వేషణలూ, ఔన్నత్యాలూ, భావాలు వున్నాయని నీకు తెలుసునా.'

'తెలుసు స్వామీ. కాని కని పెంచిన తలిదండ్రుల మాట.'

'వాస్తవ జీవితంలో ఎదురుపడిన వ్యక్తిని కొంతకాలం చెంతకు తీసుకుని మన అహంభావంతో వారిని, వారి జీవితాన్ని గాయపర్చి, కొంతకాలం ఆకాశపథంలో విహరించి అప్పుడు తల్లితండ్రు లున్నారని గుర్తొచ్చి కపట వేషధారిగా మారి వారి జీవితకుసుమాలను నలిపి అంత ఎత్తునుంచి కిందికితోయటం భావ్యమేనా!

పెదబాబు ముఖగాంభీర్యాన్ని, తేజస్సునూ చూడలేక తలవంచేశాడు యువకుడు. ఆ వేడి కన్నీళ్లు పెదబాబు కాళ్ళమీద పడకపోలేదు.

'ఇటువంటి పాపపంకిలమైన జీవితాన్ని గడిపి నీ మానసిక ఆందోళన పోగొట్టుకోటానికి ఆశ్రమాన్ని స్వీకరిస్తానంటున్నావా. జీవితపు ఉత్తమ విలువపట్ల నమ్మకమున్నవాడు ఆశ్రమాన్ని స్వీకరించటం ధర్మబద్ధంకాదు. అందుకు అనర్హుడవు.'

'ఈ ఆందోళనతో ఇట్లా కృషించి అసువులను బాయవలసిందేనా స్వామీ! నాకు మరొక మార్గం లేదా.'

'ఉన్నది. మనస్సును మాలిన్య రహితం చేసుకుని హృదయౌన్నత్యానికి ప్రాముఖ్యం ఇచ్చి ధైర్యంగా జీవితాంధకారాన్ని పారద్రోలి జీవించగల స్తోమత ఉంటే మానసిక ఆందోళన ఆశాజ్యోతిని ఏమాత్రం ఆర్పలేదు' అన్నాడు పెదబాబు నిశ్చలంగా అతని నేత్రద్వయంలోకి చూస్తూ. యువకుడు విభ్రాంతి చెందాడు. భయసంభ్రమాశ్చర్యాలతో కన్నీళ్ళను తుడుచుకుంటూ, ఆ లవలేశమైన శాంతిరేఖకోసమే నా మానసికాందోళనంతాను' అన్నాడు బాబు పాదాలమీద మోకరిల్లి.

'ఎక్కడో ఎప్పుడో మన పురాకృత సుకృతంవల్ల ఒక సున్నితహృదయం మనకి ఎదురౌతుంది జీవితంలో. జీవితంలోని ప్రతి పిలుపునీ అందుకుని తన జీవితభాగస్వామి ఏ మార్గంలో నుంచి వెళదామన్నా ఆనందంతో స్వీకరించి, అతివిషాదాన్ని చిరునవ్వుగామార్చి పలకరిస్తుంది. అటువంటి దయామయిని విస్మరించ వచ్చునా.'

'తప్పే స్వామీ. ఆ దయామయిని నన్ను క్షమించమని వేడుకుంటాను. నాకు ఆమెదర్శనం ఇప్పించండి. అని బాబు చేతులు పట్టుకుని బ్రతిమాలాడు ఆ యువకుడు.

ఇద్దరూ ఆ ఆశ్రమంలోకి వెళ్ళారు. సుశీల మంచం చూపించాడు పెదబాబు. సుశీల ముఖంలోకి చూశాడు యువకుడు. అతని మానసికాందోళన ఒక్కత్రుటిలో పోయింది. 'సుశీలా' అని పెద్దగా అరిచాడు. మెల్లిగా కళ్లు తెరిచింది సుశీల. అతన్ని చూసింది. 'గోపాల్' అంటూ తృప్తిగా ఒక్క శ్వాసవిడిచి గుండెలకి చేర్చుకుంది అతని తలను. ఇరువురి హృదయాలూ క్షణకాలం ఒక అనిర్వచనీయమైన మహా శాంతిలో లీనమైపోయినయి.